మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి

- అరకొర ఆదాయాన్ని ఇస్తున్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు
- ఆదాయం పెంపుపై మున్సిపాలిటీ నిర్లక్ష్యం
- మున్సిపాలిటీకి గుదిబండగా అల్లూరి కాంప్లెక్స్


అంతంత మాత్రంగా ఆదాయం వస్తున్న మునిసిపాలిటీ ప్రధాన అల్లూరి షాపింగ్ కాంప్లెక్స్

నరసాపురం: నరసాపురం పట్టణంలో అరకొర ఆదాయంతో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు కొనసాగుతున్నాయి. పట్టణంలో మునిసిపాలిటీకి ఉన్న ఏ షాపింగ్ కాంప్లెక్స్ పరిస్థితిని గమనించినా ఇదే విషయం తేటతెల్లమవుతుంది. పట్టణంలో మొత్తం 14 మున్సిపల్ కాంప్లెక్స్‌లు, వాటిలో 250 వరకూ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా మునిసిపాలిటీకి కేవలం నెలకు రూ.2.85 లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. చాలా షాపులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. సెంటర్‌లో ఉన్న కీలకమైన అల్లూరి సత్యనారాయణరాజు షాపింగ్ కాంప్లెక్స్‌లో కూడా షాపులు భర్తీ కాని పరిస్థితి. అల్లూరి కాంప్లెక్స్ అయితే మున్సిపాలిటీకి ఏళ్ల తరబడి గుదిబండగా ఉంది. ఇలా ఉండడం వల్ల మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుంది.

నిబంధనలకు విరుద్ధంగా లీజులు

ఇక షాపుల లీజుల విషయంలో కూడా అధికారులు నిబంధనలకు నీళ్లు వదలడం, వ్యాపారులతో లాలూచీ పడటంతో అద్దెలు పెరగని పరిస్థితి. దీర్ఘ కాలం పాటూ తరతరాలుగా ఒకరే పలుకుబడితో షాపులు దక్కించుకోవడం, తక్కువ లీజులు చెల్లిస్తుండటం గమనార్హం. లోపాలను సరిదిద్ది, మునిసిపల్ అధికారులు ఆదాయం పెంచుకోవడానికి ఎప్పుడూ చర్యలు తీసుకున్న దాఖలాలులేవు. ఇక ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్‌ల నిర్మాణం ప్రణాళికా బద్ధంగా, వ్యాపారాలకు అనువుగా లేకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చి పెడుతుంది. ఈ కారణం వల్లనే షాపుల భర్తీ జరగడం లేదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కొత్త కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అవకాశం ఉన్నప్పటికీ మున్సిపాలిటీ దృష్టి పెట్టడంలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

ఆదాయంలేని అల్లూరి కాంప్లెక్స్‌ను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేయాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తీవ్రంగా ప్రయత్నించారు. ప్రైవేట్ బాగస్వామ్యంతో కాంప్లెక్స్‌ను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేసేలా, వ్యాపారులకు నష్టం లేకుండా పాత వారికే తిరిగి వ్యాపారాలు చేసుకునేలా ప్రణాళిక తయారు చేయించారు. అయితే అప్పుడు ప్రతిపక్ష పార్టీలు ఆ ప్రయత్నాన్ని ముందుకు సాగనివ్వకపోవడంతో కాంప్లెక్స్ అభివృద్ధికి నోచుకోకుండా ఉండిపోయింది. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌ల విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఆదాయం పెంచుకునే ప్రయత్నం



మున్సిపాలిటీ ఆదాయం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం గతంతో పోలిస్తే బాగా పెరిగింది. ఖాళీగా ఉన్న షాపులను చాలా వరకూ భర్తీ చేశాం. ఆదాయం పెంపునకు సంబంధించి అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. అల్లూరి కాంప్లెక్స్‌కు ఆదాయం రాని మాట వాస్తవం. ఈ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసే అంశాలను పరిశీలిస్తున్నాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్

నేషనల్ ట్రస్ట్‌యాక్ట్ జిల్లా కమిటీ సభ్యుడిగా జేసుప్రసాద్


జి.జేసుప్రసాద్

నరసాపురం: మానసిక సమస్యలతో సతమతమయ్యే పిల్లల సంక్షేమంకోసం పనిచేసే నేషనల్ ట్రస్ట్‌యాక్ట్ పశ్చిమ గోదావరి జిల్లా కమిటీలో సభ్యుడిగా నరసాపురం ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ఐసీటీసీ కౌన్సిలర్‌గా పనిచేస్తున్న గుంటూరు జేసుప్రసాద్‌ను నియమించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా కమిటీని నూతనంగా ఏర్పాటుచేశారు. సైకాలజీ విభాగంలో తనను కమిటీ సభ్యుడిగా తీసుకున్నట్టు జేసుప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. వైద్యారోగ్యశాఖలో సేవా కార్యక్రమాలకు గాను జేసు ప్రసాద్ ఇప్పటికే పలు అవార్డులు సొంతం చేసుకున్నారు.

నేడు స్వచ్ఛతా దివస్ అవగాహన ర్యాలీ

నరసాపురం: మూడో శనివారం స్వచ్ఛతా దివస్, బీట్‌ది హార్ట్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ఎండవేడిని తట్టుకోవడం ఎలా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనేఅంశంపై అవ గాహనా ర్యాలీ చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొంటారని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన


డ్రెయినేజీని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక 17వ వార్డు పాత బ్యాంక్ కాలనీలో పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి శుక్రవారం పరిశీలించారు. గురువారం కురిసిన వర్షానికి పాత బ్యాంక్ కాలనీ వెనుక ఉన్న ప్రాంతంలో వర్షం నీరు నిల్వ ఉండిపోయి స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమాచారం కమిషనర్‌కు తెలియపజేయగా ఉదయాన్నే పట్టణ విజిట్‌లో భాగంగా ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. అక్కడ వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని పిలిచి ఎక్కడ అడ్డంకులు ఉన్నాయో తొలగించాలని సూచించారు. ఆలయం వద్ద డ్రెయినేజీపై నిర్మాణాలు కట్టడంతో డ్రెయిన్ చిన్నది అయిపోయిందని, వెంటనే వాటిని పగలగొట్టి మురుగునీరు వెళ్లే మార్గం చూడాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు, సచివాలయ సిబ్బంది గోపాల్, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

ముడుపుల ఆరోపణలు అవాస్తవం

భీమవరం: మున్సిపాలిటీ పన్ను విధింపులో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. పన్ను విషయంలో దస్తావేజులను పూర్తిగా పరిశీలించి నిబంధనల ప్రకారం పన్ను విధించామని అయితే మరో వ్యక్తి దానిపై తాను పన్ను చెల్లిస్తున్నట్లు తెలియజేసినట్లు వివరించారు. దీనిపై మున్సిపల్ చట్టం ప్రకారం దస్తావేజులు పరిశీలించిన అనంతరం పన్ను విధింపు లేదా తొలగింపు కమిషనర్ పరిధిలో ఉంటుందని మున్సిపల్ సిబ్బంది వివరణ ఇచ్చారు. పన్ను విధించిన ఆస్తికి సంబంధించిన వ్యవహారం కోర్టులో ఉన్నప్పటికీ కావాలని కొందరు మున్సిపల్ రెవెన్యూ సిబ్బందిని వివరణ అడగకుండా దస్తావేజులు పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా సిఫార్సులకు లొంగి ఏకపక్షంగా నివేదిక తయారు చేసి, కొంతమందిపై తప్పుడు రిపోర్ట్ ఇవ్వడంతో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని మున్సిపల్ చట్టం ప్రకారం విచారణ జరిపించాలని సిబ్బంది కోరుతున్నారు.

అనధికార లే-అవుట్లపై ఫిర్యాదు

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షంలో పంచాయతీ అనుమతులు లేకుండా అనధికార లే అవుట్లు వేసి క్రయ విక్రయాలు జరుపుతున్నా పంచాయతీ పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు నూకల పెదబాబు ఆరోపించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని 360-4 సర్వే నంబర్‌లో 38 సెంట్లు అనధికారికంగా లే అవుట్లు వేసి విక్రయాలు చేశారని, అందులో పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం ప్రారంభిస్తుంటే, ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పంచాయతీ ఆదాయం కొల్పోతున్నప్పటికీ, ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

గంగానమ్మకు పంచామృతాభిషేకం


గంగానమ్మకు పంచామృతాలతో అభిషేకం చేస్తున్న మహిళలు

ఆకివీడు: గంగానమ్మ కరుణించమ్మా అంటూ మహిళలు శుక్రవారం గంగానమ్మకు జలాభిషేకం, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగా పురాతన ఆలయం, నూతనంగా నిర్మించిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలు ఆలయ నిర్వాహకులు రామ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పేకాట శిబిరంపై దాడి

ఉండి: మండలంలోని పాందువ్వ శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్న సమాచారం అందడంతో ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1940 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి గంగాలమ్మ జాతర

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీదండు గంగాలమ్మ జాతర నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గరగ నృత్యాలు, ఆదివారం అమ్మవారి దర్శనం, సోమవారం అన్న సమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

లో-ఓల్టేజీ సమస్యతో సతమతం


ములపర్రులో పాత ట్రాన్స్‌ఫార్మర్

పెనుగొండ: ములపర్రు శివారు పితాని వారి పాలెంలో లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు సతమతం అవుతున్నారు. వేసవిలో లో-ఓల్టేజీ సమస్య మరీ ఎక్కువగా ఉండడంతో వారి వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయి. బయట మండుతున్న ఎండలను తట్టుకోలేక ఫ్యాన్ వేస్తే కనీసం ఫ్యాన్ సైతం తిరగకపోవడంతో ఉక్కబోతతో అల్లాడుతున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ బల్బులు బుడ్డి దీపాల్లా వెలుగుతుండడంతో నానావస్థలకు గురవుతున్నారు. గతంలో పెనుగొండ నుంచి దేవ వరకూ వచ్చే మెయిన్ లైన్‌కు ములపర్రును అనుసంధానం చేయడంతో ఇబ్బందులు ఉండేవి కావు. దానిని నిలుపుదల చేసి ఇలపర్రు లైన్‌కు కలపడంతో ఇబ్బందులు ప్రారంభమయ్యాయి.

400 కుటుంబాలకు ఇబ్బందులు

లో-ఓల్టేజీ సమస్యతో పితాని వారి పాలెంలో నివాసం ఉంటున్న 400లకు పైగా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ తీగలు సైతం పాతవి కావడంతో గాలి వీస్తే చాలు తెగిపోయి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో ఇబ్బందులు ఎక్కువ అవుతున్నాయి. పెరిగిన విద్యుత్ సర్వీసులకు అనుగుణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫామ్‌లు ఏర్పాటు లేకపోవడంతో లో ఓల్టేజీ సమస్య మరింత జఠిలమవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడంటూ వాపోయారు. ముఖ్యంగా గ్రామానికి లైన్‌మెన్ లేకపోవడంతో ఇతర గ్రామాల లైన్‌మెన్‌లపై ఆధారపడాల్సి వస్తుందని వివరించారు. దీంతో సమస్య వచ్చిన తరువాత ప్రతిసారీ ఇతర ప్రాంతాల సిబ్బంది వచ్చే వరకూ వేచి ఉండాల్సి వస్తుంది. ఇటీవల పెరిగిన ఈదురుగాలులు, భారీ వర్షాలతో ఇటు తెగుతున్న విద్యుత్ తీగలు... అటు లో-ఓల్టేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేశాడని ఆక్వా రైతుపై దాడి

- చించినాడలో విద్యుత్ అధికారుల అత్యుత్సాహం
- ఆక్వా చెరువులకు కరెంట్ సరఫరా నిలిపేసిన వైనం


యలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పురుగుల మందు డబ్బాతో ధర్నా చేస్తున్న రైతులు

యలమంచిలి: ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయని, వాటిని తొలగించాలని ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తే విద్యుత్ శాఖ అధికారులు తనపై దాడి చేశారని చించినాడ గ్రామానికి చెందిన ఆక్వా రైతు చిలుకూరి వీర వెంకట సత్య సూర్యప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతేవిద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని శుక్రవారం ధర్నాకు కూర్చున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం చించినాడలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో చించినాడ హైస్కూల్ వీధిలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. దీంతో విద్యుత్ తీగలు కిందకు వచ్చి ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి మెడలకు తగులుతున్నాయి. దీంతో సూర్యప్రసాద్ రాత్రి 8 గంటల సమయంలో కిందకు జారిన విద్యుత్ తీగలు తొలగించాలని ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు తీగలు తొలగించకుండానే తొలగించినట్లు చూపించి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు ముగించారు. ఈ మేరకు సూర్యప్రసాద్‌కు శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో మీ సమస్య పరిష్కారం అయ్యిందని ఫోన్ కాల్ రావడంతో ఆయన సమస్య పరిష్కారం కాలేదని, విద్యుత్ తీగలు తొలగించలేదని చెప్పారు. అనంతరం ఎలక్ట్రికల్ ఏఈ, ఎల్‌ఐ, జేఎల్‌ఎంలు వచ్చి విద్యుత్ లైన్‌లు సరి చేశారు. సాయంత్రం 6 గంటలకు పని పూర్తి చేశారు. పని అయిన తరువాత ఎలక్ట్రికల్ ఏఈ కిరణ్ సమక్షంలో, ఎల్‌ఐ ఎం రాజు, జేఎల్‌ఎంలు బాలకృష్ణ, త్రిపానం, మణికంత, భాను తదితరులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తావా? అంటూ సూర్యప్రసాద్‌పై దౌర్జన్యానికి దిగారు. దాదాపుగా అతని పై దాడి చేసినంత పని చేసి, ఈ ఫీడర్‌కు కరెంట్ ఇవ్వమంటూ హెచ్చరించి వెళ్లారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

అయితే ఆరు గంటలకు ఆ ప్రదేశంలో ఇళ్లకు కరెంట్ ఇచ్చి ఇండస్ట్రీయల్ ఫీడర్‌కు మాత్రం కరెంట్ ఇవ్వలేదు. దీంతో తోటి ఆక్వా రైతులంతా నీ వల్లే చెరువులకు కరెంట్ ఇవ్వలేదని సూర్యప్రసాద్‌ను నిలదీయడంతో ఆయన మనస్థాపానికి గురయ్యారు. దీంతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినందుకు తనను ఇంతలా అవమానానికి గురి చేస్తారా? అంటూ పురుగు మందు డబ్బా తీసుకుని సబ్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. దీంతో పక్క రైతులు అక్కడకు చేరుకుని పురుగుమందు డబ్బా లాక్కుని సూర్యప్రసాద్‌కు మద్దతుగా నిలిచారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు అక్కడకు రాకుండా తొమ్మిది గంటల సమయంలో ఇండస్ట్రీయల్ ఫీడర్‌కు కరెంట్ ఇచ్చారు. అనంతరం సబ్ స్టేషన్ వద్దకు పోలీసులను పంపించారు. పోలీసులు వచ్చినా రైతులు మాత్రం విద్యుత్ శాఖ అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని కోరుతూ సబ్ స్టేషన్ వద్ద ధర్నాలో కూర్చున్నారు.

డెంగీపై అవగాహన అవసరం


లంకలకోడేరులో జాతీయ డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

యలమంచిలి: ప్రజలకు డెంగీ వ్యాధిపై అవగాహన అవసరమని డాక్టర్ అద్దాల ప్రతాప్ కుమార్ అన్నారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం లంకలకోడేరు ఒకటో సచివాలయం పరిధిలో ఉపాధి హామీ కూలీలు, వైద్య సిబ్బంది కలసి ఆయన జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ డెంగీ వ్యాధిని నివారణకు కొన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్రదేశాలను శుభ్రం చేయాలన్నారు. నీటి నిల్వలు ఉన్న తొట్టెలపై, డ్రమ్ము మీద మూతలు పెట్టాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని డ్రెయినేజీల్లో చెత్త వేయకుండా జాగ్రత్తపడాలన్నారు. ఇంటి లోపల దోమల నివారణకు దోమ తెరలు వాడాలని తెలిపారు. ప్రజారోగ్యానికి దోమలు హానికరమని వాటి ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోధ వ్యాధి, మెదడు వాపు వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ ప్రతాప్ కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్, ఫార్మాసిస్ట్ పాటబళ్ల వెంకటస్వామి. సూపర్‌వైజర్ సప్పవరపు వెంకట కోటి అమలేశ్వరరావు, కె.ప్రసాద్, సీహెచ్ సత్యప్రసాద్, బి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్రు పద్దాల వెంకమ్మ సంబరం ప్రారంభం

నరసాపురం రూరల్: కొప్పర్రు మేజర్ పంచాయతీలో ఉన్న పద్దాల వెంకమ్మ సంబరాన్ని మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు కొప్పర్రు గ్రామ ప్రముఖులు తెలిపారు. శుక్రవారం చలివిడి, పానకాలు సమర్పించి జాతర ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమలో పనిచేస్తున్న గ్రామ ప్రముఖుడు పోలిశెట్టి నాగేషు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ గణాచారి యాదంరెడ్డి ధనలక్ష్మిలు ప్రత్యేక పూజలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో శేషు, అందే కవి, పోలిశెట్టి సర్వేశ్వరరావు, యాదంరెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

సంస్కార భారతి జిల్లా కార్యవర్గం నియామకం

యలమంచిలి: కళ, సాహిత్యం అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా యలమంచిలి మండలంలోని దొడ్డిపట్లకు చెందిన చేగొండి వీర వెంకట సత్యనారాయణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విభాగ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, దుర్భ శ్రీనివాస్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా పాలకొల్లు పట్టణానికి చెందిన ఎ.రాంజీ, యర్రంశెట్టి వెంకటరత్నం నియమితులయ్యారని సత్యనారాయణమూర్తి తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా మరో పది మంది, సలహా మండలి సభ్యులుగా ఐదుగురు ఎంపికైనట్లు ఆయన వివరించారు. సాహిత్య విభాగం, నాటక విభాగం, నాట్య విభాగం, చిత్రలేఖన విభాగం సభ్యులు కూడా నియామకం జరిగినట్లు సత్యనారాయణమూర్తి తెలిపారు.

లంచం అడుగుతున్నారని విద్యుత్ ఏఈకి ఫిర్యాదు

పాలకోడేరు: శృంగవృక్షంలో విద్యుత్ మీటర్లు కాలిపోయిన సందర్భంలో కొత్త మీటర్ వేయడానికి సిబ్బంది లంచం తీసుకుంటున్నారని గ్రామానికి చెందిన నూకల వీరభద్ర కోటేశ్వరరావు (పెదబాబు) ఆరోపించారు. ఒక్కో మీటర్‌కు రూ.1700 వసూలు చేశారని ఇదెక్కడ న్యాయమని ఆయన వాపోయారు. ఈ మేరకు సమగ్రమైన దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ పెదబాబు పాలకోడేరు మండల విద్యుత్ ఏఈ మాధవరాజుకు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఈ దీనిపై చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విషయమై భీమవరం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) వెంకటేశ్వరరావును వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రాలేదని విచారించి, చర్యలు చేపడతామని బదులిచ్చారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జి హేమ

యలమంచిలి: పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చునని యలమంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ జి.హేమ చెప్పారు. కిషోర వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపు శుక్రవారం యలమంచిలి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచి యుక్త వయస్సు వచ్చే వరకు మనం తీసుకునే బలవర్థకమైన ఆహారమే మన శరీర సామర్థ్యాన్ని నిర్ణయిస్తుందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎస్‌జే సత్యవతి, ఎంపీహెచ్‌ఈఓ జీవీవీ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కె.మేరీరత్నం, ఏఎన్‌ఎం వి.కనకదుర్గ అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం


జున్నూరులో వృద్ధురాలికి చెక్కు అందజేస్తున్న డీటీడీసీ బాబు

యలమంచిలి: అనారోగ్యంతో ఉన్న పేదలకు వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ మాజీ సెక్రటరీ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు అన్నారు. పోడూరు మండలం జున్నూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు నడింపల్లి లక్ష్మి (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పేదరికంతో వైద్య ఖర్చులకు కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆమె పరిస్థితి గురించి డీటీసీడీసీ బాబు, వసుధ ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మత్స బుద్ధరాజు ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఫౌండేషన్ తరపున రూ. 10వేల ఆర్థిక సాయం చెక్కు రూపంలో పంపించారు. ఆ చెక్కును శుక్రవారం డీటీడీసీ బాబు చేతుల మీదుగా నడింపల్లి లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో పెన్మత్స నాగరాజు, భూపతిరాజు సూర్పరాజు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలేవి?


వల్లూరులో కబ్జా చేసిన ప్రభుత్వ భూమి

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరులో అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని అక్రమార్కులు ఆక్రమించుకున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లదు. ఇదేఅదునుగా వారు మరింతగా పేట్రేగి ఇతర భూములపై కన్నేస్తున్నారు. వివరాల్లోకి వెళితే వల్లూరు పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 337లో కొందరు కబ్జాదారులు ఆక్రమించి షాపుల నిర్మాణాలకు పాల్పడుతున్నారని పలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణలపై 2022లో ఫిర్యాదు చేస్తే మండల సర్వే చేసి, నిర్మాణాలను నిలుపుదలచేశారు. కానీ రాష్ట్రంలో ప్రభు త్వం మారడంతో అక్రమార్కులు మళ్లీ కబ్జా ప్రయత్నానికి తెర తీశారు. ఈ ఆక్రమణలపై కూటమి ప్రభుత్వానికి కొందరు హస్తం ఉండడంతో అధికారులు కన్నెత్తి చూడడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఆక్రమణ విషయాన్ని స్థానిక పంచాయతీ ఇన్‌చార్జి సైతం పట్టించుకోకుండా ఆక్రమణదారులకు వంత పాడుతూ ప్రోత్సహిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నార. ఇదేవి షయంపై గ్రామస్తులు కేతా శ్రీనివాస రావు, కుసుమే సత్యనారాయణలు ప్రజా పరిష్కర వేదికలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పంచాయతీ పాలక వర్గం కూడా ఆక్రమణదారులకు సహకరించడం కొసమెరుపు. అక్రమ కట్టడాలు కట్టడమే కాకుండా, సంతమార్కెట్‌ను సైతం వదలకుండా ఆక్రమిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్‌సీసీ యాన్యువల్ క్యాంప్ సందర్శన


ఎన్‌సీసీ క్యాంప్‌ను పరిశీలిస్తున్న కల్నల్ రితేస్ మోహన్

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపును కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ రితేస్ మోహన్ అగర్వాల్, గ్రూప్ అడ్మినిస్ట్రేటివ్ కల్నల్ సీకే నాయక్‌లు శుక్రవారం సందర్శించారు. వారికి కళాశాల యాజమాన్య భ్యులు స్వాగతం పలికి, సత్కరించారు. అనంతరం శిక్షణ శిబిరంలోని అంశాలను వారు పరిశీలించారు. షిప్ మోడలింగ్, ముడులు వేయడం, డ్రిల్ తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను చూసి అభినందించారు. క్యాంపు కమాండర్ లెఫ్టినెంట్ సి.రోహిత్ పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.